పరిస్థితులు అడ్డు తగులుతూన్నప్పుడు అట్టి తల్లిదండ్రుల వద్దనుండి జీతం పుచ్చుకోవటం హాస్యాస్పదంగా తోస్తుంది. మొత్తంమీద తల్లిదండ్రుల లోను మేనేజిమెంట్లలోను గల ఆర్థిక దుస్థితే ఈ విద్యావ్యాప్తికి ప్రథమ అవరోధంగా స్పష్ట పడుతూంది. పోగా ఈ విద్యా వ్యాప్తికి కర్ణధారుడు కావలసిన ఉపాధ్యాయుని స్థితి బాగు పడనిదే ఈ ఉద్యమమంతా వ్యర్థ మౌతుంది. అదొక ప్రత్యేక సమస్య

ప్రభుత్వానికికూడా ఈ ప్రాథమిక విద్యా వ్యాప్తికి తీవ్ర అవరోధం ఆర్థిక సమస్యే అని చెపుతారు గాని ఒక నిర్ణీత ప్రణాళిక ప్రకారం మొదటి మెట్టుగా పాఠశాలల వసతి సౌకర్యాలు అభివృద్ధిచేయుట కష్టం కాదనిపిస్తుంది. ఏ గ్రామాని కా గ్రామంలో ఆయా గ్రామ పంచాయితీలయొక్క, గ్రామ పెద్దల యొక్క, సహకారంతో ప్రతీ వార్డులోనూ పాఠశాలకు తగిన వసతి భవనంగాని, స్థలం గాని సంపాదించుట ప్రభుత్వానికి కష్టమైనపని అనిపించుకోదు. రాష్ట్రంలో పాఠశాలలకు వసతి సౌకర్యాలు ఏర్పరచడంద్వారా మేనేజిమెంటు పక్షానగల పెద్ద ఆటంకం తొలగిపోతుంది. ఇటువంటిపని ఒక మంత్రిత్వకాలంలో శాశ్వతము-అభినందనీయము అయిన సౌకర్యము కాగలదు. ఈ విధంగానే క్రమక్రమంగా ఉపాధ్యాయుని స్థితి బాగుపరచుట-బోధన విధానంలో ఉత్తమత్వం నెలకొల్పుట మున్నగు వాటికి చర్యలు గైకొనవచ్చును. మేనేజరుకు ఉపాధ్యాయునకు మధ్యఅవరోధకమూ-విద్యావ్యాప్తికి ఆటంకముగా పరిణమించిన రు 3/- సప్లిమెంటరీ జీతాల జీ. ఓ. లవంటివి ఉపసంహరింపబడినగాని పరిస్థితులు చక్కబడవు. గనుక ఈనాటి ప్రజా ప్రభుత్వము ఇట్టి ఆటంకములను తొలగించి సానుభూతితో మార్పులు తెచ్చి రాష్ట్ర ప్రాథమిక విద్యాభివృద్ధికి వలయు మార్గముల నన్వేషింతురు గాక.

స్కెచ్

# అందాలరాజు ఆశలు

ఆర్. యం. చిదంబరం

అతను ప్రతి వీధిలోను, ప్రతి సందులోను కనిపిస్తాడు నిండుయౌవనంతో నిగనిగలాడుతున్న బంతిపడుచులున్నచోట అతను తరచు కనిపిస్తాడు. కాని వాళ్ళెదురవగానే తలవంచుకొని నడుస్తాడు. ఆ యువతులంతా అతనికేసి వేళాకోళంగా చూస్తారు. పరిహాసంగా నవ్వుతారు అతను మరింత కుంగిపోతాడు. మహారాజులుకూడా ధరించలేనంత విలువైన దుస్తులు ధరిస్తాడు. అతను భామామణులను చూడగానే సిగ్గుపడటానికి కారణం ఉంది.

అతను నల్లగా ఉంటాడు. అతని రంగు ముందు కాటుకే నయం. మెల్లకన్ను దీనికి తోడైంది. కుంటివాడేమోకూడా. మొత్తానికి పరమాసహ్యంగా ఉంటాడు. బుజాలు ఎగరవేయుటం, పెదిమలు కొరుక్కోటం అతను తరచు చేసే పనులు. తను అందంగా లేనని, తన నెవరూ ప్రేమించరని అతనికి తెలుసు. అందుకే అలాగ కుంగిపోతాడు. అతను పెళ్ళిచేసుకో లేదు. అతనికి పిల్లనెవరిస్తారు? అడుక్కునే బిచ్చగత్తెకూడా అతన్నిచూచి మైలు దూరం పారిపోతుంది.

అతని దగ్గర కావసినంత డబ్బుంది. కాని ఏం లాభం? తనవంటి కురూపి అతని కెక్కడా కనిపించలేదు. అద్దంముందు గంటలకొలదీ కాలం వృధాచేసి "మేక్-అప్" అవుతాడు. ఇంకా అసహ్యంగా తయారవుతాడు. ఒక ప్రేయసిని సంపాదించటాని కోసమే అతను వీధి వీధికీ, సందు సందుకీ పోతున్నాడు.

అతని పేరు మన్మథరావు. ఆ పేరు మార్చుకుందా మనుకుంటున్నాడు. కాలేజీలో

చదువుకునేటప్పుడు చివరి బెంచీలో కూర్చునే వాడు. అతని ముందు కూర్చున్న పొడగరులు-అమ్మాయిల అసహ్యమైన చూపుల నుండి అతన్ని రక్షించేవారు. నల్లచర్మాన్ని తెల్లగా చెయ్యగలవని వార్తా పత్రికలు ప్రకటించిన మందులు చాలా వాడాడు కాని ప్రయోజనం శూన్యం.

అతను రాజమండ్రి ప్లాట్ ఫారంమీద నిలబడున్నాడు. విశాఖపట్టణం అతని స్వగ్రామం. అక్కడికి వెళ్ళాలి. అతని గుండె దడదడ కొట్టుకుంటూ వుంది. ఏ ఆడదైనా తనెక్కిన కంపార్టుమెంటులోనికి వస్తే? ఇక తన బాధ ఆ పరమాత్ముడికే తెలియాలి.

రైలు వచ్చింది. అలసిపోయిన రైలు ఒక్క నిట్టూర్పు విడిచింది. మన్మధరావు ఫస్టు క్లాసు కంపార్టుమెంటు ఒక్కొక్కటే వెదకటం ప్రారంభించాడు. తస్సదియ్య ప్రతిపెట్టెలోను కనీసం ఇద్దరాడవాళ్ళయినా ఉన్నారు. అతనికి భయం ఎక్కువవుతోంది. చివరికి ఓ పెట్టె పట్టుకున్నాడు అందులో ఓ పడుచు తప్పించి మరెవరూ లేరు. ఆ పెట్టెలో యెక్కాడు. ఆ యువతి ఏదో మేగజైను ముఖానికడ్డం పెట్టుకుని చదువుతోంది. చప్పుడు చేయకుండా వెళ్ళి ఆమెకవతలి వైపునున్న బల్లమీద కూర్చున్నాడు. కూర్చుంటే ఎక్కడామెకు కనిపించిపోతాడో అని చల్లగా పడుకున్నాడు. బల్ల అడ్డముంది గనుక ఇంకామెకు కనిపించడు. అతను శాంతించాడు. వాచీ చూసుకున్నాడు. ఇంకా బండి బయలుదేరటానికి పదినిమిషాలుంది.

ఇద్దరు బిచ్చగాళ్ళు కొట్టుకుంటుంటే చూద్దామని కంపార్టుమెంటులోని యువతి మేగజైను బల్లమీద విసిరేసి మన్మధరావు పడుకున్న బల్ల దగ్గరకు వచ్చింది. అతని గుండె గుభేల్ మంది. కళ్ళు మూసుకున్నాడు. ఆమె అతన్ని చూచింది. అందరు పడుచులకు మల్లే అతని వికార స్వరూపానికి నవ్వలేదు. ఐదు నిమిషాలు అదే పనిగా అతన్ని చూచింది. ఏమనుకుందో ఏమో తన సీటుకు పోకుండా అతని కెదురుగా కూర్చుంది. అతని ప్రాణాలు నిలువునా పోయాయ్.

“ఎండ మండిపోతోంది.”

కమ్మటి కంఠస్వరం అతనికి వీనుల విందుగా వినిపించింది. తనని కాదన్నట్టుగా కళ్లు తెరవలేదు.

“చాలా వేడిగా ఉంది” అన్నదా యువతి. ఈ మాటలతన్ని ఉద్దేశించి అన్నవే. మన్మధరావుకు గుండె ఆగినట్లయింది. అతను కళ్ళు తెరవలేదు.

“ఏమండీ మిస్టర్! ఎండ తీవ్రంగా ఉంది కదూ?” అన్నదామె. మన్మధరావుకు తప్పింది కాదు. లేచి కూర్చున్నాడు.

“అవునవును. చాలా తీవ్రంగా ఉంది” అన్నాడు. తన మొరటు కంఠం ఆమెకు వినిపించక తప్పింది కాదు.

“మీరెక్కడిదాకా?” ప్రశ్నించిందామె.

“విశాఖపట్నానికి” అన్నాడతను. ఆ భగవంతుడు కరుణించి ఈమెతో మాట్లాడటానికైనా కమ్మటి కంఠధ్వనిని ప్రసాదించకూడదూ?

“అరె-నేనూ అక్కడికే” అన్నదామె. అతనికి భయం ఎక్కువయింది. ఆమె ఏ కాకినాడో పోకూడదూ? విశాఖ పట్టణందాకా తనని పీక్కుని తినాలా?

ఆ తరువాత అతని వివరాలడిగి తెలుసుకుంది. ఆమెను గురించి కూడా మన్మధరావు తెలుసుకున్నాడు. ఆమె ఆనర్సు చదువుతున్న విద్యావతి. పేరు స్వర్ణ. ఆమెకూడా ధనవంతుని బిడ్డే. ఆమె జన్మస్థానం మద్రాసు. ఆంధ్రదేశమంతా టూరుకొడుతోంది. మన్మధరావుకంతా అయోమయంగా వుంది. బండి కదిలింది. ఆమె మళ్ళీ మేగజైన్ విప్పింది.

మన్మధరావు ఆలోచనలో పడ్డాడు. ఆడవాళ్ళు తనను చూస్తేనే యోజనదూరం పారిపోతారు. ఆమె స్వయంగా తనను సంభాషణలోనికి లాగింది. పాశ్చాత్యదేశాలలో యువతీ యువకులమధ్య ప్రేమ కలుగటానికి సౌందర్యం కారణం కాదు. వింత మనస్తత్వాలే కారణం. ఈ విషయం అతనికి బాగా తెలుసు. వింతగా ఉండే ఓ సుందర యువతి ఓ అందవికారుడిని ప్రేమిస్తుంది. ఆ యువకుడిలో ఏదో ప్రత్యేకత ఉంటుంది. కాని తనలో ఏముంది? తనవంటి భయంకర పిశాచాన్నెవరు ప్రేమిస్తారు?

విశాఖపట్టణం చేరుకునేవరకు అతనితో మాట్లాడుతూనే ఉందామె. అవసరమైనచోట అతన్ని పొగడుతోంది. "మీరు సినిమాలలో గంభీరపాత్రలు బాగా ధరించగలరు" అని ఓ రిమార్కు పాస్ చేసింది. "భూతాలవేషం బాగా వెయ్యగలను" అని అందామనిపించిందతనికి. అతనిమీద ప్రేమ, జాలి, గౌరవం, కరుణ కనబరుస్తోంది స్వర్ణ

ఇద్దరూ విశాఖపటణంలో దిగారు. మన్మథ రావు సెలవు తీసుకోబోయాడు.

"మీ ఇల్లు చాలా పెద్దదన్నారు కదూ?" ఆమె అడిగింది.

"అవునవును, చాలా విశాలమైనది"

"మీరుతప్ప మరెవరూ లేరూ?"

"లేరు"

"మీ కభ్యంతరం లేకపోతే ఒక విషయం చెబుతాను. ఈ ఊరు నాకు క్రొత్త. ఇక్కడ వాల్తేరు ఉందన్నారు అది చూడాలని సరదాగా ఉంది. ఇక్కడొక నెలరోజులుండి ఈ చుట్టుప్రక్కలున్న గ్రామాలన్నీ చూడాలి: అన్నీ తెలిసినవారు మీరున్నారు కనక మీయింట్లోనే ఒకగది అద్దెకిస్తే బాగుంటుంది." మన్మథరావు ఈ మాటలు విని ఉప్పొంగిపోయాడు. అతని ఊహ నిజమవుతోంది. "అవశ్యం" అని సమాధానం చెప్పి ఆమె సామానంతా టాక్సీలో వేయించి ఆమెతో తన యింటికి వచ్చాడు.

ఆ యింటిని చూడగానే ఆమె ముఖం విప్పారింది. "ఇల్లు చాలా బాగుంది" "ఏమీ చూడకుండానే బాగుందంటున్నారు రండి" అని ఆమెకు ఇల్లంతా చూపించాడు. ఆ యింట్లో సగం ఆమెకు ఉండడానికిచ్చాడు. "ఈ యింట్లో ఎవరూ నివసించటంలేదు. మీరు రావటం నా భాగ్యం. మీరు నాకు దమ్మిడీ అయినా అద్దె ఇవ్వనక్కరలేదు!" అన్నాడు. స్వర్ణ అతన్ని అభినందించింది.

*

వారి పరిచయం క్రమంగా అభివృద్ధి పొందుతోంది. మన్మథరావుకు ఆమెమీద గౌరవమే కాకుండా ఒక విధమైన ఆశాపాశంకూడా పెంపొందుతోంది. ఆమెను చూడకుండా క్షణమైనా ఉండలేడు. ఆమె ఏ ఊరైనా టూరు వెళ్ళినప్పుడు తిరిగివచ్చేదాకా పచ్చి మంచినీళ్ళయినా ముట్టకుండా కనిపెట్టుకుండేవాడు. ఒకనాడు తన ప్రవర్తనను విమర్శించుకున్నాడు. తేలిన విషయం ఒక్కటే—అతను స్వర్ణను ప్రేమిస్తున్నాడు! కాని స్వర్ణ తన ప్రేమనంగీకరిస్తుందా? ఆమెకూడా తనంటే ప్రేమ, అభిమానం కనబరుస్తోంది. కనుక తన్ను ప్రేమిస్తోంది. ఇందులో సందేహం లేదు.

ఆనాడు చీకటిపడినా స్వర్ణ రాలేదు. ఏ ఊరు వెళ్ళినా తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేది. మన్మథరావు ఆమెకోసం కాచుకూర్చున్నాడు. ఏడయింది. ఎనిమిదయింది. స్వర్ణ రాలేదు. విసుగెత్తి ఆమె టేబిలు మీదున్న మేగజైన్ తీశాడు చదవటానికి. ఏదో ఉత్తరం జారిపడింది. ఆ ఉత్తరం చదవాలనిపించిందతనికి. ఎవరికైనా ప్రేమలేఖ రాసిందేమో! అన్న అనుమానంకూడా కలిగింది. వెంటనే ఆ ఉత్తరంవిప్పి చదివాడు. అది స్వర్ణ తన తండ్రికి వ్రాసిన ఉత్తరం. తన టూరుగురించి వ్రాసింది. చివరి నాలుగు పంక్తులు చదివేసరికి అతని కళ్ళు జిగేల్మన్నాయి. ఆనందంతో గంతులేశాడు.

"నాకు మన్మథరావనే ఆయనతో పరిచయం కలిగింది. ఆయన చాలా మంచివాడు. ఎన్నో ఉత్తమ గుణాలున్నాయి. నాకు స్వయంవరాధికారమిచ్చావు కనక నేను ఆయన్నే వివాహం చేసుకుంటాను."

అతను స్వర్గవీధుల్లో విహరిస్తున్నాడు.

జోళ్ళ చప్పుడయింది. మన్మథరావు వీధి గుమ్మంవైపు చూచాడు. స్వర్ణ వచ్చింది. "ఆ ఉత్తరం ఎందుకుతీశారు?" అనడిగిందికోపంగా.

"మేగజైన్ తిరగవేస్తుంటే క్రింద పడింది. క్షమించాలి...... సరేకాని ఈ ఉత్తరంలో సంగతులు నిజమేనా?"

"అక్షరాలా నిజం. నన్ను గుర్తించి ఉంటారనుకుంటా" అన్నది స్వర్ణ నవ్వుతూ.

"నేను ఎంత అదృష్టవంతుణ్ణి!"

"నేను కూడా!"

మరునాడు ఉదయం—

మన్మథరావు కమ్మటి కలలు కంటున్నాడు. కలలోకూడా తలచి యెరుగని దివ్య సంఘటన జరిగింది. తన పుణ్యం పండింది.

జోళ్ళ చప్పుడయింది. ఎవరో యువకుడు వచ్చాడు. "స్వర్ణగారు ఉన్నారా?" అని ప్రశ్నించాడు.

"ఎందుకు?" అనడిగారు మన్మథరావు.

"ఆమె నేనూ క్లాస్‌మేట్స్-ఆమె నా ప్రియమిత్రురాలు, రేపు నా బర్త్‌డే. పిలుద్దామని వచ్చాను" అన్నాడతను- మన్మథరావుకు చెడ్డ సిగ్గువేసింది, అతనెంతఅందంగా ఉన్నాడు! అతని హృదయంలో ఏవేవో భావాలు చెలరేగుతున్నాయి.

"హలో ఆనంద్" అంటూ స్వర్ణే వచ్చేసింది. "నేను నిన్న చెప్పానే మన్మథరావుగారని, ఆయనే ఈయన" అని ఆనంద్‌కు పరిచయం చేసింది. ఇద్దరూ కలిసి బయటికి పోయారు. ఈ దృశ్యం మన్మథరావు నిజంగా భరింపలేక పోయాడు. తనకు కాబోయే భార్య మరొకడితో చిద్విలాసంగా తిరుగుతోంది. అభిమానమున్న భర్త ఇదెలాగ సహిస్తాడు? ఒకవేళ స్వర్ణ తనను మోసం చేస్తోందేమో! లేకపోతే తనవంటి కురూపిని స్వర్ణ వరించటమేమిటి?

స్వర్ణ ఇంటికి రాగానే "మన వివాహం ఎప్పుడు" అనడిగాడు సూటిగా మన్మథరావు. ఏదో ఒకటి తేల్చుకోవాలని అతని పట్టుదల.

"త్వరలోనే" అన్నది స్వర్ణ. అతను శాంతించాడు. స్వర్ణ ఆనంద్‌తో తెగతిరగటం మూడు నాలుగు రోజులవరకు చూచి సహించాడు. ఇక సహించలేక పోయాడతను.

"మనసు కష్టపెట్టుకోకుండా ఉంటే ఒక్క విషయం చెబుతాను. ఆ ఆనంద్‌తో అలాగ తిరగటం ఏం బాగాలేదు. పెళ్ళయాకకూడా తిరుగుతే నా తల తీసేసినట్లవుతుంది" అని మందలించాడు మన్మథరావు.

"నేను నా యిష్టం వచ్చినట్లు తిరుగుతాను. మీకు కలిగిన నష్టమేమిటి? మీ భార్యగా ఉంటానుగా" అన్నది స్వర్ణ.

"అలాగయితే ఎలాగ? నా భార్యవయిన తరువాత అందరితో తిరుగుతే ఎలాగ? నలుగురూ ఏమనుకుంటారు? నువ్వలాగ తిరగటానికి వీల్లేదు. ఇది నా ఆజ్ఞ అనే అంటాను" మన్మథరావు కోపంగా అన్నాడు.

"అయితేవినండి మన్మథరావుగారూ! నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకోను. మీవంటి కురూపిని ఎవరూ కట్టుకోరు. నేనుఇంతకాలంనుంచీ ఆడుతున్న నాటకం యథార్థమని మీరు విశ్వసించారు. నాకు చాలా బాధగా ఉంది. కురూపియయినవాడు భార్యమీద అధికారం చెలాయిస్తాడా, చెలాయించడా! అనే అనుమానం నన్ను చిరకాలం నుండి పట్టుకొని పీడిస్తోంది. కురూపిని ఏ స్త్రీ వరించదు. మీలాంటి వాడిని సుమండీ. భార్య లభించటమే చాలని అతను తృప్తిపడతాడనుకున్నాను. కాని వాడికి కూడా భార్య మీద అధికారం చెలాయించాలని ఉంటుందని గ్రహించాను. నేను మన స్తత్వ గ్రంధమొకటి రచింప దలచాను. వింత వింత మన స్తత్వాలను ప్రోగు చేయటానికోసమే ఈ యాత్ర. నా సందేహం తీర్చుకోటానికి ఇంత నాటకం ఆడాను. ఈ ఊరు నాకు క్రొత్తకాదు. నేను అనర్సు ఇక్కడే చదివాను. నా ప్రవర్తన మీకు బాధ కలిగించి ఉంటుంది. క్షమించండి. ఇదుగో మూడువందల రూపాయలకు చెక్ - ఇది మీయింటికి అద్దె. మీ ఆదరాభిమానాలకు వందనాలు. నా సామాను సర్దుకుని వెళ్ళిపోతాను." అని స్వర్ణ తనగదిలోనికి వెళ్ళింది.

మన్మథరావు పిచ్చెత్తినవాడికి మల్లే శూన్యంకేసి చూస్తున్నాడు.

నువ్వు యుద్ధానికి వెడతావనుకో. అనంతకాలం యుద్ధం చెయ్యలేవు గద! అలాగే ఇరుపక్షాలవారూ పోరాడిపోరాడి, ఎంతో నష్టం కలిగాక, ఇంకా యుద్ధం చెయ్యడం ఏమాత్రమూ లాభంలేదని గ్రహించాక, సంధికి వస్తారు. దేనికోసం యుద్ధం చేశారో ఆ కారణాలు అలాగే మిగిలిపోతాయి.—లింకన్